సాక్షి విశాఖపట్నం

గురువారం । 23 । ఫిబ్రవరి । 2023



ట్రావెల్ బస్ దగ్ధం

శ్రీకాంత్‌నగర్‌లో బుధవారం మధ్యాహ్నం ఓ ట్రావెల్ బస్ దగ్ధమైంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. 8లో



పెండింగ్ కేసులపై సీపీ సమీక్ష

పోలీస్‌స్టేషన్లలో పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని సీపీ శ్రీకాంత్ పోలీస్ అధికారులను ఆదేశించారు. 8లో



డిశాలినేషన్ ప్లాంట్

అప్పికొండ వద్ద 100 ఎంఎల్డీ డిశాలినేషన్ ప్లాంట్‌ను పీపీపీ పద్ధతిలో నిర్మించేందుకు అధికారులు చర్చలు జరిపారు. 8లో

న్యూస్‌రీల్

కేజీహెచ్‌లో మామోగ్రఫీ పరీక్షలు

మహారాణిపేట: రొమ్ము క్యాన్సర్ నిర్ధారించే రూ.2.50కోట్ల విలువ గల మామోగ్రఫీ డిజిటల్ టోమోసింథసిస్ కేజీహెచ్‌లో అందుబాటులో ఉందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. 45 ఏళ్లు నిండిన స్త్రీలు ఉచితంగా పరీక్షలు చేసుకోవచ్చని.. కేజీహెచ్ ఆవరణలోని 29 నంబర్ గదిలో రేడియాలజీ డిపార్టుమెంట్‌ను సంప్రదించాలని సూచించారు. ఎటువంటి వ్యాధి లక్షణాలు లేకపోయినా 45 ఏళ్లు దాటిన ప్రతి ఒక్క మహిళా ఈ పరీక్ష చేసుకోవాలన్నారు. ఓపీలో నిరీక్షించకుండా.. నేరుగా రేడియాలజీ డిపార్ట్‌మెంట్‌ను సంప్రదించవచ్చన్నారు.

నేటి నుంచి ఏయూలో 'ఫార్మా' సదస్సు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్(యూఎస్ ఎఫ్‌డీఏ) సంస్థ రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి తెలిపారు. వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో వేదికగా గురువారం ఉదయం 9 గంటలకు 'కరెంట్ గుడ్ మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాక్టీసెస్' అంశంపై సదస్సు ప్రారంభమవుతుందన్నారు. ఈ సదస్సుకు యూఎస్ డ్రగ్ రెగ్యులేటరీ వ్యవస్థ ఎఫ్‌డీఏ డ్రగ్ క్వాలిటీ డివిజన్ డైరెక్టర్ కార్మిలో రోసా హాజరై కీలకోపన్యాసం చేస్తారని వివరించారు.

7న అప్పన్న డోలోత్సవం

సింహాచలం: పాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని వచ్చే నెల 7న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి డోలోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఆరోజు ఉదయం 6 గంటల సమయంలో సింహగిరి నుంచి స్వామిని కొండదిగువకి తీసుకొచ్చి పుష్కరిణీ సత్రంలోని ఉద్యానవన మండపంలో అధిష్టింపజేసి డోలోత్సవం, వసంతోత్సవం నిర్వహిస్తామన్నారు. అనంతరం స్వామికి తిరువీధి ఉంటుందని తెలిపారు. డోలోత్సవం సందర్భంగా ఆ రోజు స్వామి నిత్యకల్యాణం రద్దు చేసినట్టు పేర్కొన్నారు.

స్టెనోగ్రాఫర్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ లీగల్: విశాఖ జిల్లా వినియోగదారుల మండలి–2లో జూనియర్ స్టెనోగ్రాఫర్ ఉద్యోగానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండలి అధ్యక్షురాలు గేదెల వెంకటేశ్వరి తెలిపారు. అర్హులైన వారు మార్చి 4లోగా అధ్యక్షురాలు, జిల్లా వినియోగదారుల మండలి–2, వీఎంఆర్డీఏ రెండవ అంతస్తు, సిరిపురం, విశాఖపట్నం చిరునామాకు తమ దరఖాస్తులు అందించాలని సూచించారు.

రేపటి నుంచి చేనేత వస్త్ర ప్రదర్శన

మహారాణిపేట: నగరంలో ఈ నెల 24 నుంచి రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు జిల్లా చేనేత, జౌళి అధికారి ఆర్.వి.మురళీకృష్ణ తెలిపారు. కరకచెట్టు పొలమాంబ ఆలయం వెనుక గల ఏయూ మైదానంలో ఆ రోజు ఉదయం 10.30 గంటలకు కలెక్టర్ ఎ.మల్లికార్జున ఈ ప్రదర్శన ప్రారంభిస్తారని తెలిపారు. వచ్చే నెల 9వ తేదీ వరకు ఈ ప్రదర్శన కొనసాగనుంది.

అభివృద్ధే అజెండా..

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే విజయం

- పార్టీ ముఖ్య నేతల స్పష్టీకరణ
- నామినేషన్ దాఖలు చేసిన పార్టీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్
- 5 కి.మీ మేర వందలాది మంది పార్టీ శ్రేణులతో ర్యాలీ



తరలివచ్చిన పార్టీ ముఖ్య నాయకులతో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్



సంపత్ వినాయగర్ ఆలయంలో పూజలు

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ గెలుపునకు సోపానాలుగా నిలుస్తాయని టీటీడీ చైర్మన్, పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ మద్దతుతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్ బుధవారం తన నామినేషన్ దాఖలు చేశారు. అంతకుముందు రుషికొండలోని వేంకటేశ్వర స్వామి ఆలయం, సంపత్ వినాయక ఆలయంలో పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ శ్రేణులతో 5 కిలోమీటర్ల మేర భారీ ర్యాలీ చేస్తూ.. కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, మంత్రి బొత్స సత్యనారాయణ సమక్షంలో సుధాకర్ నామినేషన్ పత్రాలను కలెక్టర్ మల్లికార్జునకు అందించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ పార్టీలతీతంగా, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు పారదర్శకంగా పాలన అందిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానాన్ని ఈ ఎన్నికల్లో ఓట్ల రూపంలో చాటుకోవాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే లక్షలాది మంది యువతకు సచివాలయం వ్యవస్థ ద్వారా ఉపాధి కల్పించామన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు ప్రాధాన్యమిస్తున్నారని.. పట్టభద్రులు పార్టీ అభ్యర్థి విజయానికి సహకరించాలని కోరారు. అభ్యర్థి సుధాకర్ మాట్లాడుతూ నాలుగేళ్ల ప్రభుత్వ పాలనను పట్టభద్రులకు వివరించి ఓట్లు అడుగుతామన్నారు. లబ్ధి పొందిన ప్రతీ పట్టభద్రుడు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు.



ర్యాలీగా తరలివస్తున్న అభ్యర్థి సుధాకర్.. చిత్రంలో టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి, పార్టీ నేతలు

రుషికొండలో పూజలు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డితో కలిసి ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ నామినేషన్ పత్రాలను స్వామి పాదాల వద్ద ఉంచి పూజలు చేశారు. మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నాయకులతో కలిసి రుషికొండలోని ఏ1 గ్రాండ్ నుంచి ర్యాలీగా బయలుదేరి ఆలయానికి చేరుకున్నారు. పూజల అనంతరం కలెక్టర్ కార్యాలయానికి ఊరేగింపుగా వెళ్లారు. మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, వేణుగోపాలకృష్ణ, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ భీశెట్టి సత్యవతి, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పల నాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పెట్ల ఉమాశంకర్ గణేష్, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె రాజు, సమన్వయకర్తలు అక్కరమాని విజయనిర్మల, ఆడారి ఆనంద్, నియోజకవర్గ పరిశీలకులు డి.వి సూర్యనారాయణ రాజు, బొడ్డేడ ప్రసాద్, చిక్కాల రామారావు, రొంగలి జగన్నాథం, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కె.సతీష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజబాబు, కార్పొరేషన్ చైర్మన్లు జాన్‌వెస్లీ, పిల్లా సుజాత, ఫుడ్ కార్పొరేషన్ కమిషన్ సభ్యుడు కాంతారావు, వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు మొల్లి అప్పారావు, శివప్రసాద్, గొలగాని శ్రీనివాస్, ఐహెచ్ పరూఖీ, తుల్లి చంద్రశేఖర్, పేర్ల విజయచందర్, శ్రీదేవివర్మ, కలిదిండి బద్రినాథ్, బోని శివరామకృష్ణ, శ్రీదేవివర్మ, అంగ రాంప్రసాద్, చొక్కర శేఖర్, వార్డు శ్రేణులు పాల్గొన్నారు.

ఒక్క రోజే 12 నామినేషన్ల దాఖలు



నామినేషన్ దాఖలు చేస్తున్న వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి సుధాకర్



టీడీపీ మద్దతు అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న వేపాడ చిరంజీవిరావు

- ఇప్పటివరకు దాఖలైన నామినేషన్లు 18
- నేడే చివరి రోజు

మహారాణిపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు బుధవారం 12 మంది జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునకు తమ నామినేషన్ పత్రాలు అందజేశారు. వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్, టీడీపీ మద్దతు అభ్యర్థిగా వేపాడ చిరంజీవిరావు, బీజేపీ మద్దతు అభ్యర్థిగా పి.వి.ఎన్.మాధవ్ నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ రెబల్ అభ్యర్థిగా ఈర్లె శ్రీరామమూర్తి దిగారు. స్వతంత్ర అభ్యర్థులుగా విజయనగరం జిల్లా రాజాంకి చెందిన పురిపండ శ్రీనివాసరావు, విశాఖ జిల్లా సీబీఎం కాంపౌండ్‌కు చెందిన గుండుపల్లి సతీష్, వేపగుంటకు చెందిన దండేల ఆనందరావు, ఆరిలోవకు చెందిన బలివాడ రామ సంతోష్, మధురవాడకు చెందిన జి.విజయకుమార్, అనకాపల్లి జిల్లా గవరపాలెంకి చెందిన ఆడారి శరత్ చంద్ర, శ్రీకాకుళం జిల్లా సోంపేటకు చెందిన కాళ్ల లోకనాథం, మెళియాపుట్టికి చెందిన రాజానమోహన్‌రావు నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తంగా బుధవారం నాటికి 18 మంది అభ్యర్థులు 27 సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.



తెలుగుదేశం పార్టీ రెబల్ అభ్యర్థిగా ఈర్లె శ్రీరామ్మూర్తి నామినేషన్ దాఖలు

ఎమ్మెల్సీ ఎన్నికలకు జనసేనతోనే..

బీజేపీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి మాధవ్



నామినేషన్ దాఖలు చేస్తున్న మాధవ్. చిత్రంలో సోము వీర్రాజు, జీవీఎల్, విష్ణుకుమార్‌రాజు

సాక్షి, విశాఖపట్నం: ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికలకు జనసేనతో కలిసే ముందుకు వెళ్తామని బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పీవీఎన్ మాధవ్ చెప్పారు. నామినేషన్ దాఖలు చేయడానికి వెళ్లే ముందు పార్టీ కార్యాలయం, దాఖలు అనంతరం కలెక్టరేట్ మీడియా పాయింట్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చానన్నారు. ఇకపై కూడా ఉత్తరాంధ్ర అభివృద్ధికి పాటుపడతానన్నారు. ఉద్యోగుల సీపీఎస్, పీఆర్సీల సాధనకు కృషి చేస్తానన్నారు. టీచర్లకు ఒత్తిడి లేని బోధనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీ జీవీఎల్ నరసింహారావు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, ఉపాధ్యక్షుడు పి.విష్ణుకుమార్‌రాజు, బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడ ఎం.రవీంద్ర, జిల్లా ఇన్‌చార్జి శ్రీలక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జాడలేని జనసేన

జనసేనతో పొత్తు కొనసాగుతోందని పదేపదే చెప్పుకుంటున్న బీజేపీ నేతలకు జనసేన శ్రేణులు ఝలక్ ఇచ్చారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీవీఎన్ మాధవ్ నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమంలో జనసేన నాయకులు గాని, కార్యకర్తలు గాని జాడ లేకుండా పోయారు. నామినేషన్ వేసేందుకు పార్టీ కార్యాలయం నుంచి బయలుదేరే సమయంలో గానీ, ర్యాలీలో గానీ, కలెక్టరేట్ వద్ద గానీ జనసేన నేతలు కనిపించలేదు. జనసేన జెండాలు అగుపించలేదు. కేవలం బీజేపీ నాయకులు, కార్యకర్తల హడావుడే కనిపించింది. ఆ పార్టీ జెండాలే ఎగిరాయి. దీంతో బీజేపీ, జనసేనల మధ్య పొత్తు కొనసాగుతుందా? లేదా? అనేది చర్చనీయాంశంగా మారింది. ఇదే విషయాన్ని పలువురు చర్చించుకున్నారు.

దాహార్తి లేకుండా..!

- మంచినీటి ఎద్దడిపై ఫోకస్
- నాలుగు మండలాల్లో బోర్లకు మరమ్మతులు
- ఇందుకోసం 45 రోజుల కార్యాచరణ
- సక్రమంగా పనిచేస్తున్న 283 రక్షిత మంచినీటి పథకాలు

సాక్షి, విశాఖపట్నం: ఈ ఏడాది ఎండలు మండనున్నాయి. ఫిబ్రవరి నెలలోనే ఏప్రిల్ నాటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో గ్రామాల్లో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం యంత్రాంగాన్ని ఆదేశించింది. ఇందులో భాగంగా విశాఖ జిల్లాలో ఈ వేసవికి తాగునీటి సమస్యకు ఆస్కారం లేకుండా గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు ఇప్పట్నుంచే చర్యలు తీసుకుంటున్నారు. విశాఖ గ్రామీణ జిల్లాలోని ఆనందపురం మండలంలో 112, భీమునిపట్నంలో 59, పద్మనాభంలో 57, పెందుర్తి మండలంలో 37 వెరసి 265 గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో 2,547 చేతి బోర్లు (హ్యాండ్ పంప్స్) ఉన్నాయి. వీటిలో ఏఏ బోర్లు పని చేస్తున్నాయి? ఎన్ని బోర్లు మరమ్మతులకు గురయ్యాయి? వాటికి ఏ స్పేరు పార్టులు అవసరమవుతాయి? వంటివి తెలుసుకోవడానికి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు 'గ్రాష్' అనే ప్రోగ్రాంను చేపట్టారు. ఈనెల 16 నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మార్చి నెలాఖరు వరకు 45 రోజుల పాటు దీనిని కొనసాగించనున్నారు. నాలుగు మొబైల్ టీమ్‌లు, పది మంది టెక్నిషియన్లు ఆయా గ్రామాల్లో పర్యటించి మంచి నీటి బోర్ల స్థితిగతులను పరిశీలిస్తున్నారు. మరమ్మతులకు గురైన బోర్లకు రిపేర్లు చేస్తున్నారు. తేలికగా బోరు పనిచేయడానికి గ్రీజ్ అప్లయ్ చేస్తున్నారు. ఇప్పటి వరకు ఆయా గ్రామాల్లో 2,442 బోర్లు పనిచేస్తున్నట్టు గుర్తించారు. మిగిలిన వాటిలో 42 బోర్లకు మైనర్, 103 బోర్లకు మేజర్ రిపేర్లు అవసరమని తేల్చారు. ఇందుకు దాదాపు రూ.4 లక్షలు వెచ్చిస్తున్నారు.



పెందుర్తి మండలంలో బోర్లకు మరమ్మతులు

'రక్షిత' పథకాలు సురక్షితం

మరోవైపు విశాఖ జిల్లాలో వివిధ రకాల 283 రక్షిత మంచినీటి పథకాలున్నాయి. వీటిని ఎప్పటికప్పుడు సమర్థవంతంగా నిర్వహిస్తుండడంతో ఇవన్నీ సక్రమంగా పనిచేస్తున్నాయి. వీటిలో పది పథకాలు స్వల్ప మరమ్మతులకు గురవడంతో వాటిని సరిచేశారు. ఆయా గ్రామాల్లో గ్రాష్ కార్యక్రమం కింద బోర్ల పనితీరును పరిశీలిస్తున్న టెక్నిషియన్లు ఈ రక్షిత మంచినీటి పథకాల తీరుతెన్నులను కూడా తనిఖీ చేస్తున్నారు. ఒకవేళ మరమ్మతులు అవసరమైతే వాటిని సూచిస్తున్నారు. ఆ మేరకు రిపేర్లు చేస్తున్నారు.

ట్యాంకర్ల అవసరం లేదు

సాధారణంగా వేసవిలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తుంటారు. మరికొన్ని గ్రామాల్లో ఎండిపోయిన మంచినీటి చెరువుల్లో ఇతర ప్రాంతాల నుంచి నీటిని తీసుకొచ్చి నింపుతారు. కానీ విశాఖ జిల్లాలో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండడం వల్ల నాలుగైదేళ్ల నుంచి అలాంటి పరిస్థితి ఏర్పడలేదని జిల్లా గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం సూపరింటెండింగ్ ఇంజినీర్ కేవీ శివానందకుమార్ 'సాక్షి'తో చెప్పారు. రానున్న వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకోసం 45 రోజుల వేసవి కార్యాచరణను రూపొందించామని తెలిపారు.

టీడీపీ ర్యాలీలో కోచింగ్ సెంటర్ విద్యార్థులు

మహారాణిపేట: తెలుగుదేశం మద్దతు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ వేపాడ చిరంజీవిరావు నామినేషన్ ర్యాలీని తెలుగుదేశం నాయకులు పెద్దగా పట్టించుకోలేదు. జన సమీకరణకు పెద్దగా ఆసక్తి చూపలేదు. దీంతో అభ్యర్థే చోడవరం నుంచి జనాలను తెప్పించుకున్నారు. ఆయన పనిచేస్తున్న కోచింగ్ సెంటర్ నుంచి విద్యార్థులను తీసుకొచ్చారు. వచ్చిన వారితో పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. కలెక్టర్ మల్లికార్జునకు నామినేషన్ పత్రాలు అందించారు. నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల తరఫున గళం వినిపించేందుకు తనకు ఓ అవకాశం ఇవ్వాలని కోరారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, నాయకులు పల్లా శ్రీనివాసరావు, మాజీ మంత్రి కొండ్రు మురళీ, ఇతర నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కోచింగ్ సెంటర్ విద్యార్థులు

ఎమ్మెల్సీ అభ్యర్థుల ఆస్తులివే..

మహారాణిపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు స్థిర, చర ఆస్తులు, కేసులు, రుణాల వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించారు.

- వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్ తన పేరిట చరాస్తి రూ.23.58 కోట్లు, తన భార్య పేరిట రూ.87.21 లక్షలు, స్థిరాస్తి తన పేరిట రూ.22.41 కోట్లు, తన భార్య పేరున రూ.29.85 కోట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. రుణాలు తన పేరున రూ.4.63 కోట్లు, భార్య పేరిట రూ.1.05 కోట్లు ఉన్నట్లు వెల్లడించారు. పోలీస్‌స్టేషన్లలో ఎక్కడా కేసులు నమోదు కాలేదని అఫిడవిట్‌లో పేర్కొన్నారు.
- తెలుగుదేశం మద్దతు అభ్యర్థి డాక్టర్ వేపాడ చిరంజీవిరావు తన పేరున చరాస్తి రూ.34.93 లక్షలు, తన భార్య పేరున రూ.87.84 లక్షలు, స్థిరాస్తి తన పేరున రూ.2.41కోట్లు, భార్య పేరున రూ.2.47కోట్లు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. రుణాలు తన పేరిట రూ.89 లక్షలు, భార్య పేరున రూ.8.03 లక్షలు ఉన్నట్టు వెల్లడించారు. ఎటువంటి నేర చరిత్ర లేదని, కేసులు కూడా నమోదు కాలేదని తెలిపారు.
- బీజేపీ మద్దతు అభ్యర్థి పి.వి.ఎన్ మాధవ్ నగదు రూపంలో రూ.50 వేలు, భార్య వద్ద రూ.25 వేలు, తన పేరున 10 గ్రాముల బంగారం, భార్య పేరున 100 గ్రాముల బంగారం, స్థిర, చర ఆస్తులు కలిపి రూ.3.42 కోట్లు, రూ.18 లక్షల అప్పులు ఉన్నట్లు వెల్లడించారు. పలు పోలీసు స్టేషన్లలో మూడు కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు.

అభ్యర్థుల తుది జాబితా విడుదల

24న న్యాయవాదుల సంఘం ఎన్నికలు

విశాఖ లీగల్: విశాఖ న్యాయవాదుల సంఘం వార్షిక ఎన్నికల తుది జాబితాను ఎన్నికల అధికారి జి.ఎం.రెడ్డి, ఉప ఎన్నికల అధికారి ఎం.కె.శ్రీనివాస్ బుధవారం విడుదల చేశారు. అధ్యక్ష పదవికి చింతపల్లి రాంబాబు, తాళ్లూరి రవికుమార్, పాకా సత్యనారాయణ, ఐఎం అహమది పోటీలో ఉన్నారు. ఉపాధ్యక్ష పదవికి బి.ఎస్.లత, పీలా మీనాక్షి, కుప్పిలి మురళీధర్, చింతపల్లి ఆనంద కుమార్, ఎస్.ఎస్.వాసు పోటీలో ఉన్నారు. కార్యదర్శి పదవికి పైలా శ్రీనివాసరావు, ఎస్.సుధీర్ రెడ్డి, ఎస్.శంకర్రావు, రాపేటి సూర్యనారాయణ బరిలో నిలిచారు. సంయుక్త కార్యదర్శి పదవికి డి.దుర్గా ప్రసాద్, ఎ.సుందర్రావు, కోశాధికారి పదవికి ఎస్.అశోక్‌కుమార్, సిహెచ్.భాస్కరరావు, టి.రాము పోటీ చేస్తున్నారు. 24వ తేదీ సాయంత్రం 4 గంటలకు వరకు పోలింగ్, సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. ఈ ఎన్నికల్లో 3,047 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం 11 పదవులకు ఎన్నికలు జరుగుతాయి. తొలిసారిగా ఆరుగురు జూనియర్ సభ్యులకు కేవలం 9 మంది మాత్రమే పోటీలో ఉన్నారు.

కృతజ్ఞతాపూర్వక కలయిక



సీఎం జగన్‌తో ఎంపీ ఎంవీవీ, ఆడిటర్ జీవీ

మహారాణిపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో బుధవారం విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, గోపాలపురం నియోజకవర్గ పరిశీలకుడు, ప్రముఖ ఆడిటర్ గన్నమనేని వెంకటేశ్వరరావు కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ ఎంవీవీ విశాఖ పార్లమెంట్ పరిధిలోని పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. గాజువాక హౌస్ కమిటీ సమస్యను పరిష్కరిస్తూ జీవో జారీ చేసినందుకు గానూ కృతజ్ఞతలు తెలిపారు.

ఇగ్నోలో ప్రవేశాల గడువు 28 వరకు పొడిగింపు

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2023 జనవరి విద్యాసంవత్సరానికి గాను ప్రవేశాల గడువు ఈ నెల 28 వరకు పొడిగించినట్లు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. ఇగ్నో ద్వారా అందిస్తున్న డిగ్రీ, పీజీ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కేంద్రం పరిధిలోని 5 జిల్లాల విద్యార్థులకు ఆన్‌లైన్ విధానంలో ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. https://ignouadmission.samarth.edu.in/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

సీఎం జగన్ మేలు మర్చిపోలేం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, పంచకర్ల రమేష్‌బాబు

సాక్షి, విశాఖపట్నం: గాజువాక ప్రజలు 25 ఏళ్లుగా ఎదుర్కొంటున్న భూ సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిష్కరించడం గొప్ప విషయమని, సీఎం మేలు మర్చిపోలేమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కొనియాడారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో సీఎం జగన్ చిత్రపటానికి లబ్ధిదారులతో కలిసి బుధవారం క్షీరాభిషేకం చేశారు. 1999లో సీఎం చంద్రబాబు దీనిపై శాశ్వత పరిష్కారం చూపకుండా తాత్కాలికంగా హౌస్ కమిటీ ఏర్పాటు చేసి కాలయాపన చేశారని ఆరోపించారు. 2004లో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హౌస్ కమిటీ భూములను క్రమబద్ధీకరించి బాధితులను ఆదుకోవడానికి తొలి అడుగు వేశారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఈ సమస్యకు పూర్తి పరిష్కారం చూపడం చాలా ఆనందంగా ఉందన్నారు. గతంలో గాజువాక ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారు ఎవరూ కూడా ఈ సమస్య పరిష్కారంపై దృష్టి సారించిన పాపాన పోలేదని నాగిరెడ్డి పేర్కొన్నారు. హౌస్ కమిటీ భూముల సమస్యను ప్రత్యేక చొరవతో తాను అనేకసార్లు సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి పరిష్కరించారన్నారు. ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని హౌస్ కమిటీ సమస్యను అనేకమార్లు సీఎం దృష్టికి తీసుకెళ్లారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డి, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి రవిరెడ్డి, కార్పొరేటర్లు ఉరుకూటి చందు, బొడ్డు నర్సింహపాత్రుడు, పార్టీ నాయకుడు మహ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విశాఖ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

జిల్లా యూత్‌వింగ్ అధ్యక్షుడిగా ఆళ్ల శివ గణేష్(విశాఖ నార్త్), మహిళా విభాగం-అడపాల కృపాజ్యోతి(విశాఖ తూర్పు), రైతు విభాగం-మొకరా అప్పలనాయుడు(భీమిలి), బీసీ సెల్ -మన్యాల శ్రీనివాస్(విశాఖ నార్త్), ఎస్సీ సెల్- బోని శివరామకృష్ణ(విశాఖ తూర్పు), ఎస్టీ సెల్- పెంద్ర అప్పన్న(భీమిలి), మైనారిటీ సెల్-కె.వి.బాబా(విశాఖ నార్త్), విద్యార్థి విభాగం-నమ్మి లక్ష్మణరావు(భీమిలి), వైఎస్ఆర్‌టీయూసీ- కలిదిండి బద్రినాథ్(విశాఖ వెస్ట్), వాణిజ్య విభాగం- వానపల్లి ఈశ్వర్‌రావు(విశాఖ ఈస్ట్), కల్చరల్ వింగ్- బయ్యారపు రాధ(విశాఖ నార్త్), ఐటీ వింగ్-బొండ ఉమామహేశ్వరరావు(విశాఖ తూర్పు), పంచాయతీరాజ్ వింగ్-లెంక రాంబాబు(భీమిలి), క్రిస్టియన్ మైనారిటీ -అబిడపల్లి రవిబాబు(గాజువాక), పబ్లిక్ వింగ్-దొడ్డి రామనాథ్(విశాఖ దక్షిణ), వైఎస్సార్ సేవాదళ్- వంకాయల మారుతీ ప్రసాద్(భీమిలి), వీవర్స్ వింగ్-చిక్కా సత్యనారాయణ(గాజువాక), డాక్టర్ వింగ్- వాకా చంద్రశేఖర్‌రెడ్డి(విశాఖ దక్షిణ)లను నియమించారు.

పార్టీ పటిష్టతకు కృషిచేయాలి

జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు పార్టీ పటిష్టతకు కృషి చేయాలని, పార్టీ ఎల్లవేళలా వారికి అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్టు పార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వెల్లడించారు. బాధ్యతలు స్వీకరించనున్న నాయకులకు ఆయన అభినందనలు తెలిపారు.

బ్యాడ్మింటన్ జట్టు మేనేజర్‌గా అంకమ్మ

విశాఖ స్పోర్ట్స్: భారత జూనియర్స్ జట్టుకు మేనేజర్‌గా ఏపీ బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి పి.అంకమ్మచౌదరి వ్యవహరించనున్నారు. నెదర్లాండ్స్‌లో మార్చి 1 నుంచి 5 వరకు, బెర్లిన్‌లో మార్చి 8 నుంచి 12 వరకు జరిగే ఇంటర్నేషనల్ జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నీలో జట్లు పాల్గొనున్నాయి. 20 మంది జూనియర్ ఆటగాళ్లు ఈ టోర్నీలో సత్తాచాటనున్నారు. గతంలో అంకమ్మ ఇంగ్లాండ్‌లో జరిగిన ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీకి జట్టు మేనేజర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా అంకమ్మను జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు సిహెచ్ వంశీకృష్ణ శ్రీనివాసరావు, చుక్కా శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

ఛాతీ తెరవకుండా గుండె కవాటం మార్పు

80 ఏళ్ల వృద్ధురాలికి మెడికవర్ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్లు

ఎంవీపీ కాలనీ (విశాఖ తూర్పు): గుండె సంబంధిత సమస్యతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న 80 ఏళ్ల రోగికి మెడికవర్ ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా అరుదైన శస్త్ర చికిత్స చేశారు. ఛాతీ తెరవకుండానే హార్ట్ వాల్వ్ రీ ప్లేస్మెంట్ శస్త్ర చికిత్స ద్వారా రోగి ప్రాణాలు కాపాడారు. ఈ వివరాలను ఆస్పత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ హేమంత్‌కుమార్ బెహ్రా, డాక్టర్ అశ్విన్‌కుమార్ పాండా వివరించారు. ట్రాన్స్‌కాథెటర్ అయోర్టిక్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ (టీఏవీఆర్) విధానంలో ఈ శస్త్ర చికిత్స చేసినట్లు తెలిపారు. గుండెలో నొప్పి, ఆయాసం, శ్వాస ఆడకపోవడం వంటి సమస్యలతో 80 ఏళ్ల మహిళ ఆస్పత్రిలో చేరారు. దీంతో ఎకో కార్డియోగ్రఫీ ద్వారా క్లినికల్ మూల్యాంకనంతోపాటు ఇమేజింగ్ చేసిన అనంతరం రోగి బృహద్ధమని కవచం టైట్ అవ్వడం వల్ల పై ఇబ్బందులకు గురవుతున్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో టీఏవీఆర్ విధానంలో విజయవంతంగా శస్త్ర చికిత్స చేశారు. ఈ కొత్త విధానం చెన్నై, బెంగుళూర్, హైదరాబాద్‌లలో అందుబాటులో ఉండగా అనుభవజ్ఞులైన మెడికవర్ డాక్టర్లు విశాఖలో ఈ విధానం ద్వారా విజయవంతంగా శస్త్ర చికిత్సలు అందిస్తున్నారు. ఈ శస్త్ర చికిత్స చేయించుకున్న మహిళను రెండో రోజే డిశ్చార్జ్ చేయగా ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు.

ట్రావెల్ బస్ దగ్ధం



పూర్తిగా కాలిన బస్

ఆరిలోవ: శ్రీకాంత్‌నగర్‌లో బుధవారం మధ్యాహ్నం ఓ ట్రావెల్ బస్ దగ్ధమైంది. లక్ష్మీనగర్ సచివాలయం ఎదురుగా శ్రీకాంత్‌నగర్‌లో ఖాళీ స్థలం ఉంది. ఆ స్థలంలో స్థానికులు కార్లు, కొందరు ప్రైవేట్ ట్రావెల్ బస్‌లు నిలుపుతుంటారు. బుధవారం ఉదయం ఓ ట్రావెల్ బస్‌ను ఇక్కడ నిలిపారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో బస్ నుంచి పెద్ద ఎత్తున మంటలు, దట్టమైన పొగ ఎగిసిపడ్డాయి. దీంతో స్థానికులు ఆందోళన చెందారు. కొందరు మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించారు. స్థానికుల సమాచారం మేరకు ఆరిలోవ పోలీసులు, అగ్నిమాపక దళం అక్కడకు చేరుకుని స్థానికులతో కలసి మంటలు అదుపు చేశారు. అప్పటికే బస్ పూర్తిగా దగ్ధమైంది. ఆకతాయిలు నిప్పంటించారా లేదంటే ట్రావెల్ యజమాని అంటే గిట్టనివారు ఎవరైనా ఈ ఘటనకు పాల్పడ్డారా.. బస్సులో వైర్లు కలిసిపోయి షార్ట్ సర్క్యూట్ అయిందా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

అప్పికొండ వద్ద డిశాలినేషన్ ప్లాంట్

దాబాగార్డెన్స్: అప్పికొండ వద్ద 100 ఎంఎల్డీ డిశాలినేషన్ ప్లాంట్‌ను పీపీపీ పద్ధతిలో నిర్మించేందుకు ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్(ఏపీయూఐఏఎంఎల్), ఐడీఈ టెక్నాలజీస్ ప్రతినిధులు చేతన్, శ్రీనివాస్ బుధవారం జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబును తన కార్యాలయంలో కలిసి చర్చలు జరిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామని కమిషనర్ వారికి తెలిపారు. సమావేశంలో ప్రధాన ఇంజనీరు రవికృష్ణరాజు, పర్యవేక్షక ఇంజనీరు కె.వి.ఎన్.రవి, ఐడీఈ టెక్నాలజీస్ ప్రతినిధి సైన్హా, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై సీపీ సమీక్ష

దొండపర్తి: పోలీస్‌స్టేషన్లలో పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ సీహెచ్. శ్రీకాంత్ పోలీస్ అధికారులను ఆదేశించారు. బుధవారం పోలీస్ సమావేశ మందిరంలో డీసీపీ-1 సునిత్ సునీల్ గరుడ్, డీసీపీ(క్రైం) జి.నాగన్న, డీసీపీ-2 కె.ఆనందరెడ్డిలతో పాటు ఏడీసీపీలు నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పనితీరును పరిశీలించారు. స్టేషన్ల పరిధిలో పెండింగ్ కేసుల వివరాలను ఆరా తీశారు. నగరంలో క్రైం రేట్ మరింత తగ్గే విధంగా పనితీరు ప్రదర్శించాలని సూచించారు. వచ్చే నెలలో జరగనున్న అంతర్జాతీయ కార్యక్రమాలపై పలు ఆదేశాలు జారీ చేశారు. జీ-20 సమావేశాలకు తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై చర్చించారు. గత నెలలో విధులలో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో పాటు పలు కేసులను సత్వరం ఛేదించిన పోలీసులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.